## చురకలు 25 - చావా

Back Home

ఈ పేజీ ని పంపండి

వీరప్పన్!!! మళ్ళీ దేశం మొత్తం తలుస్తున్న పేరు.. మీ సంగతేమో గానీ, నా వరకు నాకు ఆ మగానుభావుడి ఫోటో ఒకటి పెట్టి రోజూ దండం పెట్టుకోవాలని ఉంది. సంవత్సరాల తరబడి నాలుగు రాష్ట్రాల పోలీసులని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తున్న వాడు మరి!

సాక్షాత్తు బెంగుళూరు పోలీసు కమీషనర్, వీరప్పన్ ని పట్టుకోవడం కోసమే నియమించబడినవాడు, వీరప్పన్ ని పట్టుకోవడం తమ వలన కాదేమో అన్న అనుమనం వ్యక్తం చేసాడు. పైగా అతనికున్న నెట్ వర్కు మన పోలీసులకి లేదని చెప్పాడు. ఎత్తుకుపోవాలనుకొన్న వాళ్ళ పేర్లు ముందే చెప్పినా మనం ఏమీ చేయలేము అని ఆయనే చెప్పారు. ఈ వార్త ఈ పాటికి వీరప్పని చదివి, గుబురు మీసాల చాటున చిరునవ్వొకటి నవ్వుకొంటూ ఉంటాడు.

నాకు సమాధానం దొరకని ప్రశ్న ఒకటుంది. అడవిలో తిని, అడవి లో తిరిగేవాడు అతనికెందుకంటారు అంత సంపద? కనపడీ కనపడని నిజం ఒకటుందంటా నేను. అడవి బయట ఉన్నవాళ్ళ కోసమే వీరప్పన్ పని చేస్తున్నాడని. బయట ఉన్నవాళ్ళంటే, మన లాంటి సామాన్య జనం కోసం కాదు సుమా! కొందరు నాయకులని. ఒకవేళ పేదలకోసమే అయితే నిజంగా దండం పెట్టుకోవాల్సిన మనిషే. కాదంటారా?

ప్రశ్న తరువాత నాదో సలహా ఉందండోయ్ వీరప్పన్ కి. అలా అడవుల్లో తిరగడం కన్నా మన దేశం లో జైళ్ళలో బతకడం హాయి అని. లాలూ గారిని చూస్తే తెలియడం లా? జైల్లో ఉన్నా ఆయన రాజ్యాన్ని ఏలడంలా? అంతగా కావాలంటే వీరప్పన్ కూడా జైల్లో ఉండే అడవులని కొల్లగొట్టుకోవచ్చు సకల సౌఖ్యాలూ అనుభవిస్తూ!! బయట ఉన్న తన అనుచరులతో మాట్లాడుకోడానికి సెల్ ఫోన్ ఇస్తారు. ప్రపంచం లో ఏమి జరుగుతోందో చూడటానికి కలర్ టెలివిజన్ ఇస్తారు. మరీ విసుగ్గా ఉంటే చూడటానికి అన్ని రకాల సినిమాలూ చూపిస్తారు. ఇంక తిండికీ తాగుడు కీ లోటు ఉండదు. అసలిదంతా నేను చెప్పాలటండీ? ప్రియతమ ముఖ్యమంత్రి గారే ఒకానొక జైలు ని దర్శించి, ఆ సౌకర్యాలని చూసి, అక్కడే ఉండాలని ఉంది అని అనలేదూ?!

సలహా తరువాత, వీరప్పన్ కి నాలాంటి వాళ్ళు తోడున్నారని చెప్పాలనుకొంటున్నా. వీరప్పన్ ని దొంగ, ఖూనీకోరు అనే అర్హత ఆ అనేవాళ్లందరికీ లేదు. అ మాట కొస్తే దొంగ కానిదెవరు? వీరప్పన్ దొంగ అయితే బియ్యం అమ్ముకొన్నవాళ్లందరూ దొంగలే. పెట్రోలు పంపులు అమ్ముకొన్నవాళ్లందరూ దొంగలే. సూటుకేసులు తీసుకొని ప్రభుత్వాన్ని గట్టెక్కించుకొస్తున్న వాళ్ళందరూ దొంగలే. అఖండ భారతావనిలో, ప్రభుత్వాఫీసుల్లో పనిచేసే వాళ్ళలో లంచం తీసుకొనే వాళ్ళందరూ దొంగలే. ఇందరిని వదిలేసి, పాపం, వీరప్పన్ ని దొంగ అనడం ఏమి న్యాయం? ఇలా బహిరంగం గా ప్రజల సొమ్ము దోచుకొనే వాళ్ళనేమో అసెంబ్లీలకీ, పార్లమెంటులకీ

పంపించి, ప్రకృతిని దోచుకొంటున్న వీరప్పన్ ని జైలు కి పంపాలనడం న్యాయం గా అన్యాయం.

అయ్యా వీరప్పన్ గారూ!! మీరేమీ బాధ పడకండి. మీ వెనుక నాలాంటివాళ్ళున్నారు. మీరు దొరికితే ఎక్కడ వాళ్ళ పేర్లు బయటకొస్తాయో అని మీరు దొరకకుండా జాగ్రత్తపడే నాయక గణం, సమాజం లో పెద్దలు చాలామంది ఉన్నారు. పొరపాటున మీరు దొరికి జైల్లో ఉన్నా మీకోసం అన్ని రకాల పనులు చేసిపెట్టే జైలు అధికారులున్నారు. దొరికినా మీకేమీ శిక్ష పడకుండా చూసే న్యాయకోవిదులున్నారు. మీకేసు కోర్టులో ఉండగానే, ఒకవేళ మీరు ఎన్నికలలో పోటీ చేస్తే గెలిపించడానికి గొర్రెల్లాంటి జనం ఉన్నారు. నిశ్చింతగా ఉండండి.

* * End * *

---

మీ సూచనలూ, సలహాలూ రచయిత చావా కి తెలియచేయండి.